# మాయమ్మ మళ్ళా పుట్టింది

భూపతి రామారావు




చీకటిపడింది. పార్కులో 'లైట్లు' వెలిగేయి. రేడియో మోగుతూ వున్నది. సత్యనారాయణ ఏదో చెబుతున్నాడు. ఆ మాటలు నాకు ఈ చెవిలో దూరి ఆ చెవిలో నుంచి పోతున్నాయి. నా ఆలోచన ఇక్కడ లేదు.

మా ముందు నుంచి ఆంజనేయులూ, వసంతా నడిచి వెళ్లారు. మూలగా కూర్చుని ఉండటము వలన, వాళ్ళు మమ్మల్ని చూడలేదు. ఆంజనేయులు ఏదో చెబుతూ వున్నాడు. వసంత నవ్వుతున్నది. వాళ్ళిద్దరూ సంతోషంగా ఉన్నారు.

''ఏరా! నేను చెబుతున్నది నీ చెవుల పడిందా?'' అని అడిగేడు సత్యనారాయణ హఠాత్తుగా.

''ఆ'' అన్నాను ఆలోచనల్లో నుంచే.

''అయితే, ఏమంటావు ఆ సంగతి?'' అన్నాడు నన్ను పరీక్ష చేస్తున్నట్టు.

''అట్లాగే.'' అన్నాను, తప్పించుకోవటానికి, ప్రయత్నం చేస్తూ.

''ఏమిటి, అట్లాగే?'' సత్యనారాయణ వదిలి పెట్టలేదు.

''అదే. నువ్వు చెప్పిందానికి ఒప్పుకుంటున్నాను.'' అన్నాను.

సత్యనారాయణ పగలబడి నవ్వేడు. నేను తెల్ల బోయాను!

''నేను చెప్పలేదు. అడిగేను.'' అన్నాడు.

''ఏమి అడిగేవు?'' అన్నాను. అతను నా సంగతి కనిపెట్టేడు.

''సర్లే. అందంతా మరొకసారి ఆలోచించు కుందాను. ప్రస్తుతం నీ 'ధ్యాస' మరోచోట ఉన్నది. ఇవాళ్టికి చాలించి వేద్దామా?'' అన్నాడు సత్యనారాయణ. తల వూపాను.

ఇద్దరం లేచేము.

మాకు కొంచము అవతలగా కూర్చుని, మమ్మల్ని గమనించకుండానే మాట్లాడుకుంటూ వున్న వసంతా ఆంజనేయులు మాటలు ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి

సత్యనారాయణ అన్నమాట నిజం. నాధ్యాస ఇక్కడ లేదు. 'రూమ్'లో కూర్చుని ఉన్న నాగేశ్వరరావు చుట్టూ పరిభ్రమిస్తూ ఉన్నవి నా ఆలోచనలు. ఆ సాయంత్రము మా కోసం సత్యనారాయణ వచ్చే ముందు మా ఇద్దరికీ మధ్య కొంత గ్రంథము నడిచింది.

''అలా వెళ్ళి వద్దాము. లే'' అన్న నా మాటలికి, ''నేను రాను. మీరు వెళ్ళిరండి'' అని సమాధానం చెప్పి బిగుసుకుపోయాడు నాగేశ్వరరావు. అతను మాతో రాలేదు. ఈరోజు అతని ధోరణి మరీ విపరీతంగా ఉన్నది.

దాదాపు అయిదు నెలలయింది అది జరిగి.

నేను ఆ రోజు కాలేజీ నుంచి ఆలస్యంగా వచ్చాను. నేను వచ్చేసరికి తల రెండుచేతుల మధ్యా పట్టుకుని కుర్చీలో కూర్చుని ఉన్నాడు నాగేశ్వరరావు.

''ఏమిటి సంగతి?'' అని దగ్గరకు వెళ్లాను.

''ఇదుగో ఇది చూడు'' అంటూ ఉత్తరాన్ని నా చేతుల్లో పెట్టాడు. నేను సందేహిస్తూ, దాన్ని టేబులు మీదికి విసిరేశాను.

''ఏమి రహస్యాలు లేవులే. చదువు.'' అన్నాడు నాగేశ్వరరావు.

''ఊహూ'' అని అయిష్టత సూచించాను.

''అయితే. నన్ను చెప్పమంటావా?'' అన్నాడు తలెత్తి. అతని కళ్ళు ఎర్రగా ఉన్నాయి. చెప్పమన్నట్టు తలాడించాను.

''మా నాన్నగారి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది.'' అన్నాడు.

''ఊహూ.''

''పి. యూ. సీలో చదువుతున్నది. వసంత. నీకు తెలుసుగా!''

''ఊఁ.''

''ఆ అమ్మాయి మా నాన్నగారికి బావమరిది కూతురవుతుందట! దూరపు చుట్టరికం. ఏదో విషయమయి మాటపట్టింపు వచ్చి మొన్నటి దాకా రాకపోకలు లేవట! మొన్న ఏదో పనిమీద మావూరు వచ్చాడట ఆయన. మా ఇంటికి వచ్చి మానాన్నని మాట్లాడించాడట. ఇద్దరూ పాతసంగతులు మరిచి పోయి మామూలుగా అయినారట! ఒకరోజు ఉండి వెళ్ళాడట ఆయన మా ఇంట్లో.

''ఆయనకి గుంటూరులో పెద్దవ్యాపారం ఉందిట! వసంత ఆయనకి ఒక్కతే కూతురట! మాటల మధ్య మా సంగతి కూడా వచ్చిందట. నేనూ, ఆఅమ్మాయీ ఈ వూళ్ళోనే చదువు కొనసాగించటం ఇద్దరికీ ఆనందదాయకం అయిందట!

''అప్పుడే, ఆ ప్రస్తావన కూడా తెచ్చాడట ఆయన. వసంతని నాకిచ్చి పెళ్ళి చేయాలని తనకి ఉందన్నట్టు కూడా సూచించాడట! మా ఇద్దరికీ ఏమీ అభ్యంతరం లేదు. అయిన సంబంధము. కలిసి పోతుంది. నువ్వు ఆ అమ్మాయిని ఎరుగుదువా?'' అని రాశారాయన అన్నాడు నాగేశ్వరరావు.

''ఇందులో అంత ఇదవ్వాల్సిందేమి ఉంది? నీకు ఇష్టం లేకపోతే ఆ సంగతి రాసెయ్యి. ''అన్నాను.

''ఇది ఇక్కడితో ఆగితే నువ్వన్నది 'కరెక్టే'. మానాన్న ఆవిధంగా రాశాడంటే ముప్పాతిక పని అయినట్టే. ఇంకా చూడు. ఒకటిరెండు రోజులలో మరొక ఉత్తరం వస్తుంది.'' అన్నాడు నాగేశ్వరరావ్

డికి వెళ్ళాడు? నాగేశ్వరరావుని రక్షించాలి. కాని నేను ఏం చెయ్యను? ఎక్కడికెళ్ళను? గబగబా తలుపులు వేసి, తాళంలాగి చూశాను ఎందుకయినా మంచిదని.

వెనక్కి తిరిగి, పరుగెత్తినట్టుగా అడుగులు వేశాను. ఎక్కడికో నాకే తెలీదు! తలెత్తి చూసిన

## అడ్డం తిరిగిన కథ

నాకు ఆశ్చర్యం కలిగింది! నిలువు గ్రుడ్లు వేసుకుని నిలబడిపోయాను అట్లాగే!!

తలారా స్నానం చేసిన నాగేశ్వరరావు, అప్పుడే, ఇంటి వాళ్ళ బావి దగ్గర నుంచి వస్తూ, నన్ను చూసి నవ్వుతూ అన్నాడు. "ఏమిటి? అట్లా ఉన్నావు?" అని. "నువ్వు కూడా స్నానం కానివ్వు. రెండో ఆటకి పోదాము." అని తిరిగి అతనే అన్నాడు. మౌనంగా వెనక్కి తిరిగాను. ●


ప్ర ధా న మం త్రి క రు వు స హా య క ని ధి కి ఉ దా రం గా వి రా ళ మి వ్వం డి

ఇంధ్రశక్తి

# ఇది
# సాధారణమైన
# విజ్ఞప్తి కాదు....

"వెనువెంటనే రెండవసారిగా ఇప్పుడు ఏర్పడిన ఘోరమైన అనావృష్టి పరిస్థితులవల్ల లక్షలాది మన దేశ ప్రజల శ్రేయస్సుకు విఘాతం కలుగుతున్నది. వారి జీవితాలకు పెద్ద విపత్తు కలుగుతున్నది......

"అనావృష్టి ప్రాంతాలలోను, కొరత ఏర్పడిన ప్రాంతాలలోను బాధలకు గురిఅవుతున్న ప్రజలకు భారీయెత్తున సహాయం చేయవలసిందని ప్రతి వ్యక్తికి నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

"నగదు రూపంలోకానీ వస్తు రూపంలోకానీ చెక్కులను విరాళాలను ప్రధాన మంత్రి కరువు సహాయనిధి, క్యాబినెట్ సెక్రటేరియట్, రాష్ట్రపతి భవన్, న్యూఢిల్లీ-4 కు పంపవచ్చు."

ఇందిరా గాంధీ
—ప్రధాన మంత్రి

ప్రధానమంత్రి కరువు సహాయక నిధిని ఉదారంగా విరాళమివ్వండి

DA 66/F2


ప్ర ధా న మం త్రి క రు వు స హా య క ని ధి కి ఉ దా రం గా వి రా ళ మి వ్వం డి

ప్ర ధా న మం త్రి క రు వు స హా య క ని ధి కి ఉ దా రం గా వి రా ళ మి వ్వం డి

ప్ర ధా న మం త్రి క రు వు స హా య క ని ధి కి ఉ దా రం గా వి రా ళ మి వ్వం డి